దుమ్ము కమ్మేస్తోంది

- రెడీమిక్స్ ప్లాంటు దుమ్ముతో కాలుష్యం కష్టాలు
- శ్రీవాణినగర్, గణేశ్‌నగర్ వాసుల ఇబ్బందులు
- సమస్య పరిష్కరించాలంటున్న స్థానికులు



సిమెంట్ కాంక్రీట్ రెడీమిక్స్ ప్లాంట్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డి–మేడ్చల్ జిల్లాల సరిహద్దుల్లో ఉన్న ఓ రెడీమిక్స్ సిమెంట్ కాంక్రీట్ ప్లాంటు నుంచి వస్తున్న దుమ్ముతో జిల్లాలోని అమీన్‌పూర్ పట్టణంలోని పలు కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సిమెంట్ ధూళి, దుమ్ముతో గాలి కాలుష్యమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా అమీన్‌పూర్ పట్టణంలోని శ్రీవాణినగర్, గణేశ్‌నగర్, వెదిర టౌన్‌షిప్ వంటి కాలనీవాసులను ఈ సమస్య వేధిస్తోంది. అలాగే మియాపూర్ పరిధిలో ఉన్న హెచ్‌ఎంటీ కాలనీ వాసులకు కూడా ఈ ఇబ్బంది ఉందని చెబుతున్నారు. 24 గంటలు పని చేసే ఈ ప్లాంటు నుంచి రాత్రి వేళల్లో విపరీతంగా దుమ్ము ఇంట్లోకి సైతం వచ్చేస్తోందని వాపోతున్నారు. చిన్నారులు, వృద్ధులు మరింత ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ఈ రెడీమిక్స్ ప్లాంటు చుట్టూ వందలాది నివాసాలున్నాయి. అపార్టుమెంట్లు కూడా వెలిశాయి.

రాకపోకలతో ట్రాఫిక్ సమస్యలు

ఈ ప్లాంటు నుంచి నిత్యం పదుల సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సిమెంట్ కాంక్రీట్‌ను తరలించేందుకు ఈ వాహనాలు రోడ్లపై తిరుగుతున్నప్పుడు వచ్చే దుమ్ముతో కూడా వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. అసలే ఇరుకైన రోడ్లతో ఇబ్బందులు ఎదురవుతుంటే ఈ భారీ వాహనాల రాకపోకలతో ఒక్కోసారి ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. రోడ్లు కూడా ధ్వంసమయ్యాయని, మరమ్మతులు లేకపోవడంతో గుంతలు పడ్డాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాణాలు పాటించాలని విజ్ఞప్తి

దుమ్ము.. ధూళి బయటకు వెదజల్లకుండా అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాల్సి ఉంటుంది. ప్రధానంగా స్ప్రింక్లర్లు పెడితే దుమ్ము, ధూళిని నివారించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇక కన్వేయర్ బెల్ట్ మూసివేయడం, మిక్సర్ వద్ద కూడా నిర్ణీత ప్రమాణాలు పాటించాలని అంటున్నారు. కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులు ఈ ప్లాంటును పరిశీలించి గాలి కలుషితం కాకుండా నిబంధనలు పాటించేలా చూడాలని ఆయా కాలనీల వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నాం

సిమెంట్ కాంక్రీట్ రెడీమిక్స్ దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నాం. ధూళి ఇంట్లోకి సైతం వస్తోంది. గాలి వీచినప్పుడు దుమ్ము సమస్య తీవ్రంగా ఉంటోంది. చిన్న పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. చలికాలంలో సమస్య మరింత తీవ్రంగా మారుతోంది. మా సమస్యను పరిష్కరించాలి.

–కిషన్‌సింగ్, శ్రీవాణినగర్‌వాసి

అధికారుల దృష్టికి తీసుకెళ్తాను

రెడీమిక్స్ ప్లాంటు నుంచి వస్తున్న దుమ్ము, ధూళితో సంగారెడ్డి జిల్లా వాసులు ఇబ్బందులు పడుతున్నట్లు మా దృష్టికి రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే పరిశీలన కోసం సంబంధిత ఏరియా అధికారి దృష్టికి తీసుకెళ్తాం. సంబంధిత జిల్లా అధికారులు ప్లాంటును పరిశీలించి అవసరం మేరకు చర్యలు తీసుకుంటారు.

–గీతా సపారే, పీసీబీ ఈఈ

క్లుప్తంగా

పశువుల పాకగా బస్టాండ్



పశువుల పాకగా పుల్‌కల్ బస్టాండ్

పుల్‌కల్(అందోల్): ప్రయాణికుల కోసం నిర్మించిన బస్టాండ్‌ను వినియోగించకపోవడంతో పశువుల పాకగా మారింది. మండల కేంద్రం పుల్‌కల్ బస్టాండ్ రెండు దశాబ్దాల క్రితం రూ.6.5 లక్షలు ఖర్చుపెట్టి నిర్మించారు. బస్టాండ్‌లో బస్సులు ఆపకుండా దగ్గరలోని హోటల్ వద్ద ఆపుతుండటంతో నిరుపయోగంగా మారింది. దీంతో పశువుల పాకగా.. మందుబాబులకు అడ్డగా మారింది. చిన్నచిన్న మరమ్మతులు చేసి బస్టాండ్‌ను ఉపయోగంలోకి తేవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

స్థానిక ఎన్నికల్లో సీపీఎం పోటీ



సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్

జహీరాబాద్ టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం పోటీ చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.రాంచందర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రామిక్ భవనంలో నిమ్జ్ భూబాధితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎం పార్టీ నిమ్జ్ భూబాధితుల తరఫున నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. రైతులతో పాటు కూలీలకు న్యాయం చేయాలని, భూముల రక్షణ కోసం ఉద్యమిస్తుందన్నారు. రైతుల కోసం ఎన్నికల్లో పోటీ చేస్తామని, ఎర్రజెండాకు అండగా ఉండి గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు సుకుమార్, తుల్జారాం, శంకర్, రాజు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానించిన నాయకులు

జహీరాబాద్ టౌన్: నీట్(ఎంబీబీఎస్) కౌన్సిలింగ్‌లో మెడికల్ సీట్లు సాధించిన గిరిజన విద్యార్థులను తెలంగాణ బంజార ఎంప్లాయిస్ సేవా సంఘం(టీబెస్) ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. మండలంలోని మధులై తండాకు చెందిన వైష్ణవి పవార్, నందునాయక్ తండాకు చెందిన సావిత్రి, మందగుబ్బడి తండావాసి బాలరాం, కుంచారంపల్లి తండాకు చెందిన దీపక్ నీట్‌లో ర్యాంక్‌లు సాధించి మెడికల్ కాలేజీలో ప్రవేశాలు పొందారు. స్థానిక బంజార భవన్‌లో వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీబెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరాం రాథోడ్, నాయకులు అర్జున్, రమేశ్‌బానోత్ పాల్గొన్నారు.

పేరుకుపోతున్న చెత్తకుప్పలు



పట్టణంలోని బైపాస్ రోడ్డుపై వేసిన చెత్త

సంగారెడ్డిటౌన్: పట్టణంలోని పలు కాలనీల్లో ఎటు చూసినా చెత్తకుప్పలు పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో కాలనీల్లోని రోడ్లపైన ఇష్టమొచ్చినట్లు చెత్తాచెదారం వేసి వెళ్తున్నారని కాలనీల ప్రజలు వాపోతున్నారు. కుళ్లిన వ్యర్థాలతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాలనీల్లో చెత్త సేకరణకు చెత్తబండ్లు రావడం లేదని ఖాళీ స్థలాల్లో చెత్త కుప్పలుగా పారబోస్తున్నారని పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని, కాలనీల్లో ఎప్పటికప్పుడు చెత్త కుప్పలను శుభ్రం చేయాలని ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

జైపూర్‌కు తరలిన తపస్ నాయకులు



జైపూర్ వెళ్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: రాజస్థాన్‌లోని జైపూర్ పట్టణంలో జరుగుతున్న అఖిల భారతీయ రాష్ట్రీయ శైనిక్ మహాసంఘ్ జాతీయ సదస్సుకు తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు జహీరాబాద్ నుంచి బయలుదేరారు. జాతీయ సదస్సు మూడు రోజుల పాటు జరగనుంది. సంఘం(తపస్) నాయకులు బస్వరాజ్, దత్తాత్రి, నర్సింహ్మారెడ్డి, గోపాల్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మతల్లి పల్లకీ సేవ



పల్లకీ సేవలో పాల్గొన్న సంఘం సభ్యులు

జోగిపేట(అందోలు): జోగిపేటలో గంగమ్మతల్లి పల్లకీ సేవ మత్స్యకారుల సహకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అందోల్ చెరువు గట్టుపై ఉన్న గంగమ్మ దేవాలయం నుంచి బసవేశ్వర విగ్రహం మీదుగా గౌని చౌరస్తా, క్లాక్‌టవర్, పోచమ్మ దేవాలయం హనుమాన్ చౌరస్తా మీదుగా ఊరేగించారు. బాణాసంచా కాల్చుతూ గంగమ్మ తల్లికి జై అంటూ ముందుకు కదిలారు. దేవీ నవరాత్రోత్సవాలు ముగిసిన తర్వాత గంగమ్మ తల్లి పల్లకీ సేవను ప్రతి సంవత్సరం నిర్వహిస్తామని అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. మత్స్యకారుల సహకార సంఘం నాయకులు చాపల యాదగిరి, జలగరి యాదగిరి, జోగయ్య, దశరథ్, సంతోష్‌కుమార్, శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

నీటి సమస్యపై అధికారుల్లో కదలిక



నీటి సమస్య గురించి తెలుసుకుంటున్న షేక్ పాషా

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం ఖాజాపూర్‌లో తాగునీటి సమస్య తీర్చాలని గ్రామస్తులు ఆందోళన చేయటంతో అధికారుల్లో కదలిక వచ్చింది. ఆదివారం ఖాజాపూర్ గ్రామాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ షేక్ పాషా సందర్శించారు. గ్రామంలో తిరిగి సమస్యను తెలుసుకున్నారు. మంచి నీటి పథకం బోర్లు పరిశీలించారు. కొత్తగా బోరు మోటార్‌ను పంచాయతీ సిబ్బందికి అప్పగించారు. సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట మిషన్‌భగీరథ గ్రిడ్ ఏఈ జైపాల్ ఉన్నారు.

రసాయన డ్రమ్ముల దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

పటాన్‌చెరు: స్మశాన వాటికలో గుర్తుతెలియని వ్యక్తులు రసాయన డ్రమ్ములను తగలబెట్టిన సంఘటన అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేట స్మశాన వాటికలో చోటు చేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు కిష్టారెడ్డిపేట స్మశాన వాటికలో రసాయన డ్రమ్ములను తగలబెట్టారు. దీంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థానానికి చేరుకుని ఫైర్ ఇంజన్‌తో మంటలను ఆర్పేశారు. అమీన్‌పూర్, కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడలో పొగ కమ్ముకోవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం



రేడియల్ రోడ్డు పక్కన ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేడియల్ రోడ్డు నిర్మించిన సమయంలో రోడ్డుకు ఇరువైపుల వర్షపు నీరు వెళ్లేందుకు కాల్వను నిర్మించారు. కానీ పలు అపార్ట్‌మెంట్లకు చెందిన డ్రైనేజీ నీటిని ఇందులోకి వదులుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాలు పడితే పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్



కౌడిపల్లి : మాట్లాడుతున్న రమేశ్‌గౌడ్

కౌడిపల్లి(నర్సాపూర్): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్ తెలిపారు. ఆదివారం మండల బీజేపీ నాయకులతో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ చేస్తున్న అభివృద్ధి పనులపై ప్రచారం చేయాలన్నారు. అన్ని పంచాయతీల్లో వార్డు సభ్యులు, సర్పంచ్‌తోపాటు ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు గెలిచేలా కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, మండల అధ్యక్షుడు రాకేష్, అశోక్, శేఖులు, కృష్ణ, విష్ణు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా కృషి

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ బలోపేతంగా ఉందని బీజేపీ మండల ఇన్‌చార్జ్ గుండం శంకర్ అన్నారు. ఆదివారం ఆయన బీజేపీ నాయకులతో సమావేశమయ్యారు. రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు.

ఖేడ్‌లో మోస్తరు వర్షం

నారాయణఖేడ్: నారాయణఖేడ్ ప్రాంతంలో ఆదివారం ఉదయం ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో చేతివచ్చిన పంటలు దెబ్బతిన్నాయి. పత్తి, సోయా, జొన్న, వరి, కంది తదితర పంటలు భారీగా దెబ్బతిన్నట్లు రైతులు చెబుతున్నారు. నాలుగైదు రోజులుగా వర్షాలు పడకపోవడంతో ఇప్పుడిప్పుడే పొలాల్లోకి వెళ్లి పనులు చేసుకుంటున్న రైతులకు మళ్లీ వర్షాలు కురవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న తుల్జరామ్

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని రజక కేరీలోని పెద్దమ్మ భవానీ మందిరం అమ్మవారి విగ్రహ ఊరేగింపు మహోత్సవం కరపత్రం ఆదివారం జీటీఆర్ డెవలపర్స్ అధినేత తుల్జరామ్ ఆవిష్కరించారు. మంగళవారం నిర్వహించనున్న అమ్మవారి విగ్రహ ఊరేగింపు మహోత్సవం జీటీఆర్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేయనున్నట్లు చెప్పారు.

నేడు అలయ్ బలయ్

వట్‌పల్లి(అందోల్): దసరా పండుగ సందర్భంగా తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిభించే అలయ్ బలయ్ కార్యక్రమం సోమవారం మండల కేంద్రం వట్‌పల్లిలోని గురుకృప ఫంక్షన్‌హాల్‌లో ఉ.10.30 గంటలకు అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు మాజీ చైర్మన్ వీరారెడ్డి తెలిపారు. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి హరీశ్‌రావు రానున్నట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆత్మీయులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

సంగారెడ్డి టౌన్ : రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో సోమవారం దసరా పండగ పురస్కరించుకొని ఆత్మీయ సమ్మేళనం (అలయ్ బలయ్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు పృథ్వీరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డిలోని విద్యానగర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ధనుంజయ, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున పాటిల్, ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, కోశాధికారి శివకుమార్ పాల్గొన్నారు.

ఉచిత నీటి సరఫరా

నర్సాపూర్: మున్సిపాలిటీలోని రెండో వార్డులో ఉచితంగా నీటి సరఫరా చేసేందుకు ట్యాంకర్ ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ వార్డు ఇన్‌చార్జి సుధీర్‌గౌడ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మిషన్ భగీరథ పథకంలో సాంకేతిక కారణాలతో నల్లాల ద్వారా నీళ్లు తక్కువగా వస్తున్నాయన్నారు. నీటి సమస్యను అధిగమించేందుకు నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.



బస్సులో ఎక్కడానికి పాట్లు పడుతున్న ప్రజలు

తిరుగు ప్రయాణం పాట్లు

బస్సులు లేక అవస్థలు



జహీరాబాద్ బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

జహీరాబాద్ టౌన్: దసరా పండుగకు సొంత ఊళ్లకు వచ్చిన ప్రజలు పండుగ ముగియడంతో తిరుగు ప్రయాణమవుతున్నారు. జహీరాబాద్ నియోజకవర్గం నుంచి హైదరాబాద్‌కు వచ్చే ప్రయాణికులతో ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కిక్కిరిసింది. ఉద్యోగం, ఉపాధి, విద్యాభ్యాసం తదితర పనుల కోసం నగరాలకు వెళ్లిన వారంతా పండగకు ముందు నుంచే సొంత ఇళ్లకు వస్తుంటారు. దసరా సెలవులు ముగియడంతో గ్రామీణ ప్రాంతాలకు వచ్చిన ప్రజలు మళ్లీ హైదరాబాద్ తదితర నగరాలకు వెళ్తున్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు లేక ప్రజలు నానా పాట్లు పడ్డారు. బస్సు వచ్చిందంటే చాలు సీటు కోసం పరుగులు తీయడం కనిపించింది. బస్సుల కోసం ప్రజలు బస్టాండ్‌లో గంటల తరబడి ఎదురుచూశారు. సెక్యూరిటీ బందోబస్తు మధ్య ప్రయాణికులు బస్సుల్లో ఎక్కడం కనిపించింది.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ పథ్ సంచాలన్



సమావేశంలో పాల్గొన్న సంఘ్ సేవకులు



జహీరాబాద్: ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల పథ్ సంచాలన్

జిన్నారం (పటాన్‌చెరు): ఆర్‌ఎస్‌ఎస్ శతజయంతి వేడుకలను ఆయా పట్టణాల్లో ఘనంగా నిర్వహించారు. జిన్నారం, గుమ్మడిదల, బొల్లారం, గడ్డపోతారంలో ఆదివారం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందరోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక హిందూ జాగరణ సమితి ఆధ్వర్యంలో భారీగా పథ్ సంచాలన్ ర్యాలీలు నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న సంఘ్ సేవకులపై పూలవర్షం కురిపించి ఘనస్వాగతం పలికారు. ముఖ్యఅతిథిగా ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహ రవికుమార్ హాజరై మాట్లాడారు. ప్రతీ ఒక్కరై దేవం కోసం, ధర్మం కోసం అడుగు ముందుకు వేయాలని పిలుపునిచ్చారు. హిందూ సమాజాన్ని సంఘటితం చేసే ఉద్యమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో హిందూ జాగరణ సమితి అధ్యక్షుడు ఆనంద్ చారి, ప్రత్యేక ఆహ్వానితులు కరుణ సాగర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షుడు బ్రహ్మేందర్, సంఘ్ ప్రముఖులు గంగు భాస్కర్, వినోద్ రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

హిందుత్వాన్ని విస్తరించడమే లక్ష్యం

సదాశివపేట(సంగారెడ్డి): హిందుత్వాన్ని భారతీయ సంస్కృతి, నాగరిక విలువలను నిలబెట్టడమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జిల్లా ప్రచార సర్దార్‌జీ అన్నారు. పట్టణంలోని పాతపేరుమాళ్ల హనుమాన్ మందిరం నుంచి, మాణిక్‌ప్రభు మందిరం, శాస్త్రీరోడ్, సుభాష్‌రోడ్, గాంధీచౌక్ మీదుగా బసవ సేవాసదన్ ఫంక్షన్ హాలు వరకు సంఘ్ కార్యకర్తలు గణవేషలు ధరించి పదసంచనలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్‌గౌడ్, స్వయం సేవకులు పాల్గొన్నారు.

దేశ సంస్కృతిని కాపాడుకోవాలి

జహీరాబాద్ టౌన్: దేశ సంస్కృతి, సంప్రదాయ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ ప్రముఖ్ హన్మంత్‌రావు, బర్దిపూర్ బావి పీఠాధిపతి డాక్టర్ సిద్ధేశ్వర్ మహరాజ్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా జహీరాబాద్ పట్టణంలో ఆదివారం పథ సంచాలన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పట్టణంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మంత్‌రావు, సిద్ధేశ్వర్ మహరాజ్ మాట్లాడుతూ.. హిందూ సమాజాన్ని బలోపేతం చేయడానికి నడుం బిగించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ నగర సంచాలక్ డాక్టర్ సురేశ్ కులకర్ణిలు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం



సమావేశంలో పాల్గొన్న నాయకులు, ఉపాధ్యాయులు

నారాయణఖేడ్: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఆదివారం ఖేడ్‌లోని ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి రాఘవేందర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను తక్కువ ఫీజుతో అందించడమే ప్రైవేట్ పాఠశాలల లక్ష్యమన్నారు. మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులను ఉన్నత స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసిన వారిని సన్మానించారు. ఎంఈఓలు మన్మథకిషోర్, రాజశేఖర్, సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి సతీష్ షెట్కార్, జనార్దన్ రెడ్డి, ఖేడ్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాశ్, మహాదేవ్, ప్రభాకర్, విష్ణువర్ధన్‌రెడ్డి, అంజయ్య, సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

బ్రిడ్జిలు లేక అవస్థలు

- వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

కంది(సంగారెడ్డి): వర్షం కురిసిందంటే ఆ రోడ్లపై వాహనాల రాకపోకలు నిలిచిపోతాయి. నీటి ఉధృతి తగ్గాక మాత్రమే వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. కాశీపూర్ కలివేముల దారిలో చెరువు అలుగుపై బ్రిడ్జి ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు తీవ్ర పడుతున్నారు. మండల పరిధి కాశీపూర్‌లోకి వెళ్లేదారిలో చెరువు అలుగుపై బ్రిడ్జి లేక వాహనదారులు, కాలినడకన వెళ్లే ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షాలకు గ్రామం మధ్యలో ఉన్న చెరువు నిండి అలుగుపై నుంచి నీరు పెద్ద ఎత్తున ప్రవాహిస్తోంది. అదే అలుగుపై నుంచి కాశీపూర్ పాత గ్రామంతో పాటు పలు గ్రామాలకు వెళ్లే దారి ఉంది. వర్షాకాలంలో అలుగుపై నుంచి పెద్దఎత్తున వరద పారే సమయంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో ఈ దారిగుండా వెళ్లే కలివేముల, చెర్లగూడెం, తోపుగొండ, శంకర్‌పల్లి మండలం, గాజులగూడ తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఆయా గ్రామాలకు వెళ్లేవారు నీటి ఉధృతి తగ్గే వరకు ఆగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండల పరిధిలోని ఎర్దనూర్ నుంచి ఎర్దనూర్ తండాకు వెళ్లే దారిలో అలిసాగర్ చెరువుకు వాగు ద్వారా పెద్ద ఎత్తున వరద నీరు వస్తుంది. ఆ సమయంలో నీరు తగ్గే వరకు గంటల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. గతంలో ఇద్దరు వ్యక్తులు చెరువులోకి కొట్టుకుపోయి మృతి చెందారు. అధికారులు స్పందించి చెరువుల అలుగులపై బ్రిడ్జిలను ఏర్పాటు చేసి తమ ఇబ్బందులను తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



చెరువు అలుగుపై నుంచి పారుతున్న వరద